సూర్య నమస్కారాలు



మండలంలో రథసప్తమి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. వేంకటేశ్వర, కొప్పోల్ ఉమాసంగమేశ్వర దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు సూర్యనమస్కారాలు చేయించి, వాటి ఉపయోగాలను వివరించారు. ఇళ్లల్లో మహిళలు పిడకలపై పాలు పొంగించి, పరమాన్నం వండి సూర్యుడికి నివేదించారు.

– పెద్దశంకరంపేట(మెదక్):



మెదక్ పట్టణ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో రథ సప్తమి సందర్భంగా బుధవారం విద్యార్థులకు సూర్య నమస్కారాల పోటీలు నిర్వహించారు. 11 మంది విద్యార్థులు 250 కి పైగా సూర్య నమస్కారాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు పోచయ్య, ప్రధానాచార్యులు ఆనంద్‌రెడ్డి, ఆచార్యులు చంద్రశేఖర్, అవంతి, సద్గుణ, వందన పాల్గొన్నారు.

– మెదక్ మున్సిపాలిటీ:

క్లుప్తంగా

ఉన్నత చదువులు చదువుకోవాలి



ఎల్ఈడీ టీవీ అందిస్తున్న మహేశ్‌గుప్తా

శివ్వంపేట(నర్సాపూర్): విద్యార్థులు ఏకాగ్రతతో ఉన్నత చదువులు చదువుకోవాలని మాజీ జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా అన్నారు. మండల కేంద్రం శివ్వంపేటలోని హనుమాన్ నగర్ ప్రాథమిక పాఠశాలకు మంగళవారం తనసొంత నిధులతో ఎల్ఈడీ టీవీని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనర్సయ్య, కొండల్, పోచగౌడ్, రాములుగౌడ్, అశోక్, రమేశ్‌గుప్తా, భూమేశ్, గొండస్వామి, తదితరులు ఉన్నారు.

సన్మానం



మల్లేశ్‌గౌడ్‌ని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): జిల్లా బీజేపీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన వాల్దాస్ మల్లేశ్‌గౌడ్‌ని మండల బీజేపీ నాయకులు సన్మానించారు. బీజేపీ మండలాధ్యక్షుడు రవి ఆధ్వర్యంలో పలువురు నాయకులు నర్సాపూర్‌లో ఆయన్ను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అశోక్, కొండల్‌రావు, శ్రీధర్‌గౌడ్, భిక్షపతి, నాగరాజు, తదితరులు ఉన్నారు.

వైభవంగా భవానిమాత ఆలయ ఉత్సవాలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలోని నర్సంపల్లితండాలోని గిరిజనుల ఆరాధ్య దైవం భవానిమాత, సంత్ సేవాలాల్ ఆలయ వార్షికోత్సవాలు వైభవంగా నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన ఈ ఉత్సవాలు వేదమంత్రోచ్చరణల మధ్య చందర్ మహరాజ్, మంగ్యా మహరాజ్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం పూజలు, హోమం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు బిక్యానాయక్, సోమ్లానాయక్, భాషా, వసురామ్, శంకర్ పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు



చిట్కుల్ శివారులో డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న పోలీసులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మద్యం తాగి వాహనాలు నడపొద్దని, రోడ్డు నిబంధనలు సక్రమంగా పాటించాలని ఏఎస్ఐ మిస్బావుద్దీన్ అన్నారు. మంగళవారం మండలంలోని చిట్కుల్ శివారులో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడిపితే, ఎదురుగా వచ్చే వారికి సైతం ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జరిమానాలతో చర్యలు తీసుకుంటామన్నారు.

పనిచేయని సెల్ఫీ పాయింట్



నిరుపయోగంగా సెల్ఫీ పాయింట్

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో దాతలు ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ నిరుపయోగంగా మారింది. తూప్రాన్- నర్సాపూర్ హైవే పక్కన శివ్వంపేటలోని బస్టాండ్ పక్కన మాజీ జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా మూడేళ్ల క్రితం ఐ లవ్ శివ్వంపేట సెల్ఫీ పాయింట్ విద్యుత్ వెలుగులతో ఏర్పాటు చేయించారు. ప్రస్తుతం సెల్ఫీ పాయింట్ వద్ద మెయింటెనెన్స్ లేకపోవడంతో పిచ్చిమొక్కలతో నిండిపోయింది. ఈ విషయం గురించి పంచాయతీ కార్యదర్శి రమాదేవి దృష్టికి తీసుకెళ్లగా.. సెల్ఫీ పాయింట్ వద్ద పిచ్చి మొక్కలు తొలగించి, విద్యుత్ లైట్లకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఆలయాల్లో పూజలు



ప్రత్యేక అలంకరణలో బగలాముఖీ అమ్మవారు

శివ్వంపేట(నర్సాపూర్): రథసప్తమి సందర్భంగా మండలంలోని పలు ఆలయాల్లో మంగళవారం పూజలు చేశారు. మండల కేంద్రం శివ్వంపేటలోని బగలాముఖీ శక్తిపీఠం, సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహ స్వామి, చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి, దొంతిలోని వేణుగోపాలస్వామి ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు.

డాక్టర్ కోసం ఎదురు చూపులు

- అస్తవ్యస్తంగా పీహెచ్‌సీలు
- ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతున్న వైద్యురాలు
- పల్లె దవాఖాన డాక్టర్‌తో విధులు చేయిస్తున్న వైనం
- పట్టించుకోని జిల్లా వైద్యాధికారులు



అల్లాదుర్గం పీహెచ్‌సీలో డాక్టర్ కోసం ఎదురుచూస్తున్న రోగులు

అల్లాదుర్గం(మెదక్): ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతూ..కింది స్థాయి డాక్టర్లతో విధులు చేయిస్తున్నారు. పీహెచ్‌సీల్లో ఉదయం 9 గంటలకే రోగులు వైద్యం కోసం వచ్చి, వారి పనులకు పోతుంటారు. కానీ డాక్టర్ లేకపోవడంతో గంటల తరబడి వారు ఎదురు చూస్తున్నారు. ఇది మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం దుస్థితి. మంగళవారం ఉదయం సాక్షి ఆరోగ్య కేంద్రానికి వెళ్లగా.. పలు ఆసక్తికర సంఘటనలు వెలుగులోకి వచ్చాయి. ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో పాటు సమావేశం ఉండటంతో ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆశవర్కలు ఆస్పత్రికి వచ్చారు. డాక్టర్‌తో పాటు కొందరు సిబ్బంది రాలేదు. 11 గంటలు దాటిన తర్వాత డాక్టర్ సారిక వచ్చారు. చిల్వెర పల్లె దవాఖానకు చెందిన డాక్టర్ సంధ్య 10–30 గంటలకు వచ్చి అల్లాదుర్గంలోని రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. అనంతరం తాను చిల్వెర గ్రామానికి వెళ్తున్నానని చెప్పారు.



అల్లాదుర్గం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 10:30 గంటలు దాటినా ఖాళీగా ఉన్న డాక్టర్ కుర్చీ

ఇదిలా ఉండగా.. డాక్టర్ సమయానికి రాకపోవడంతో చిల్వెర పల్లె దవాఖాన మూతపడిందని, దీంతో తమకు వైద్యం అందడటం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

ఎప్పుడు వస్తారో తెలిదు

అల్లాదుర్గం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు కొంత కాలంగా విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని, ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్తారో తెలియడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జిల్లా వైద్యాధికారికి ఫోన్‌లో ఫిర్యాదు చేసినా.. ఫలితం లేదన్నారు. ఆరోగ్య కేంద్రంలో సీసీ కెమెరాలు పెట్టినా సక్రమంగా విధులకు రాక పోవడం గమనార్హం. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఇలాకలోనే ఇలా ఉంటే.. జిల్లాలో ఎలా ఉంటుందో మంత్రికే తెలియాలని స్థానికులు అనుకుంటున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రోగులు వేడుకున్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి



ఆర్డీఓ, మహిపాల్

నర్సాపూర్: ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఆర్డీఓ, డివిజనల్ ఎన్నికల అసిస్టెంట్ రిటరి్నంగ్ అధికారి మహిపాల్ సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. పట్టభద్రుల ఎమ్మెల్సీ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనలు పాటించాలని, ఎవరు ఉల్లంఘించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫ్లెక్సీలు, సమావేశాలు పెట్టుకోవడానికి అనుమతులు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయొద్దని తెలిపారు. సమావేశాల్లో పాల్గొనే ప్రజాప్రతినిధులు వాగ్దానాలు చేయొద్దన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పదవులకు ఎన్నికలు జరుగుతున్నందున డివిజన్ పరిధిలోని అన్ని మండల కేంద్రాల్లో రెండు పోలింగ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తామన్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులు తమకు కేటాయించిన పోలింగ్ స్టేషన్‌లో ఈనెల 27న తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. పోలింగ్ ఉదయం 8గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు కొనసాగుతుందని వివరించారు.

కేంద్ర బడ్జెట్‌ను తప్పుబట్టడం సరికాదు

చిలప్‌చెడ్(నర్సాపూర్): కేంద్రబడ్జెట్‌ను తప్పుబడుతూ పలువురు కాంగ్రెస్ నాయకులు నిరసన కార్యక్రమాలు చేయడం సరికాదని మండల బీజేపీ అధ్యక్షుడు నగేష్‌యాదవ్ అన్నారు. మంగళవారం బీజేపీ నాయకులు బడ్జెట్ కేటాయింపులో తెలంగాణకు ప్రాధాన్యతనిచ్చినందుకు పీఎం నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ గౌడ్, మాజీ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, నాయకులు సత్యనారాయణ, నారాయణరెడ్డి, రాజగౌడ్, శేఖర్, యాదగిరి పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

మనోహరాబాద్(తూప్రాన్): అన్ని వర్గాలకు సముచితంగా బడ్జెట్ ప్రవేశపెట్టారని బీజేపీ రాష్ట్ర నాయకుడు మల్లేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మండలాధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో మోదీ, నిర్మలాసీతారామన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

యువత అన్నిరంగాల్లో ముందుకెళ్లాలి



నర్సంపల్లి పెద్దతండాలో కబడ్డీ విజేత జట్టుతో నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): యువత క్రీడలతో పాటు అన్ని రంగాల్లో ముందుకెళ్లాలని నార్సింగి మాజీ జెడ్పీటీసీ కృష్ణారెడ్డి అన్నారు. నార్సింగి మండలంలోని నర్సంపల్లి పెద్దతండాలో రెండు రోజుల పాటు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతగా నర్సంపల్లి పెద్దతండా నిలవగా, బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు స్నేహభావాన్ని పెంపొందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మైలారం బాబు, బీజేపీ నాయకులు నితిన్, గ్రామ పెద్దలు చత్రియా, బిక్యా, భాషా, సోమ్లా తో పాటు తదితరులు పాల్గొన్నారు.

అటవీ ప్రాంతంలో రోడ్డు నిర్మాణంపై సర్వే



సర్వే చేస్తున్న అధికారులు

రామాయంపేట(మెదక్): మండల పరిధిలోని అక్కన్నపేట అటవీ శివారులో జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా అటవీ, జాతీయ రహదారి అధికారులు కలిసి సర్వే నిర్వహించారు. మంగళవారం ఫారెస్ట్ జాయింట్ డైరెక్టర్ ప్రవీణ, ఫారెస్ట్ బృందం జాతీయ రహదారి అధికారులు మెదక్ ఎల్కతుర్తి జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా అటవీ ప్రాంతంలోని జంతువులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సర్వే చేస్తునట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి విద్యాసాగర్, అధికారులు పాల్గొన్నారు.

సర్వర్ డౌన్‌తో ఇబ్బందులు

శివ్వంపేట(నర్సాపూర్): ధరణి సర్వర్ డౌన్‌తో రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన వారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రెండు రోజుల నుంచి తహసీల్దార్ కార్యాలయంలోని ధరణి పోర్టర్ సర్వర్ సక్రమంగా రాకపోవడంతో అమ్మకాలు, కొనుగోలు దారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సోమవారం 20 రిజిస్ట్రేషన్లకు సంబంధించి స్లాట్ బుక్ చేసుకోగా, 8 మాత్రమే రిజిస్ట్రేషన్లు మిగతా 12 రిజిస్ట్రేషన్ల దారులు మంగళవారం రావాల్సి వచ్చింది. మంగళవారం కూడా సర్వర్ డౌన్‌తో ఇబ్బందులు తప్పలేదు. ధరణి పోర్టర్ మార్పులో భాగంగా సర్వర్ డౌన్ సమస్యలు నెలకొన్నాయని కార్యాలయ సిబ్బంది అన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మెదక్ మున్సిపాలిటీ: నేడు ఎన్ఎస్ఎఫ్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలు, తండాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం మెదక్ ట్రాన్స్‌కో ఏడీఈ మోహన్‌బాబు మంగళవారం తెలిపారు. మెదక్ మండలంలోని ఎన్ఎస్ఎఫ్ సబ్‌స్టేషన్‌లో సమ్మర్ యాక్షన్ పనులు చేయనున్న నేపథ్యంలో ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలు, తండాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మెదక్ ట్రాన్స్‌కో ఏడీఈ మోహన్‌బాబు, మెదక్ రూరల్ ఏఈ రాజ్‌కుమార్ చెప్పారు. ఈ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తామన్నారు. ఈ విషయంలో ఆయా గ్రామాల ప్రజలు తమకు సహకరించాలని కోరారు.

చెక్కుల పంపిణీ



చెక్కులు అందిస్తున్న రాజిరెడ్డి

నర్సాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్ పథకం కింద మంజూరైన చెక్కులను కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు. శివ్వంపేట మండలంలోని బీమ్లా తండాకు చెందిన పలువురు లబ్ధిదారులకు రూ.ఒకలక్ష 55వేల చెక్కులను అందించారు. పార్టీ నాయకులు నవీన్‌గుప్తా, హరీశ్ తదితరులు ఉన్నారు.

అభ్యంతరాలుంటే చెప్పండి: ఎంపీడీఓ



వెల్దుర్తి(తూప్రాన్): మాట్లాడుతున్న ఎంపీడీఓ ఉమాదేవి



పెద్దశంకరంపేట(మెదక్): మాట్లాడుతున్న ఎంపీడీఓ రఫీఖ్‌ఉన్నీసా

వెల్దుర్తి(తూప్రాన్): ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే బుధవారం సాయంత్రం లోగా తెలపాలని ఎంపీడీఓ ఉమాదేవి అన్నారు. మంగళవారం పూర్వ వెల్దుర్తి మండలంలోని 32 గ్రామ పంచాయతీల్లో సప్లమెంటరీ ఫేజ్–2 ఓటరు జాబితాపై వివిధ రాజకీయ పార్టీల అధ్యక్షులతో ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాను గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద నోటీసు బోర్డులో ఏర్పాటు చేశామని ఆమె అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మహేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నాయకులకు అవగాహన

పెద్దశంకరంపేట(మెదక్): స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నూతన ఓటరు జాబితాపై రాజకీయ నాయకులకు ఎంపీడీఓ రఫీఖ్‌ఉన్నీసా అవగాహన కల్పించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా పార్టీల నాయకులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఎన్నికలకు నాయకులు సహకరించాలన్నారు. నాయకులు మధు, నారాగౌడ్, సంతోష్, సంగమేశ్వర్, సుభాష్‌గౌడ్ ఉన్నారు.

186 కొత్త ఓటర్ల నమోదు

అల్లాదుర్గం(మెదక్): మండలంలో 186 మంది కొత్త ఓటర్లు నమోదైనట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ చెప్పారు. మంగళవారం ఎంపీపీ కార్యాలయంలో రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త ఓటర్ల నమోదుతో పంచాయతీల్లో ఓటర్ లిస్టు అందుబాటులో ఉందని తెలిపారు. ఇందులో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శేషారెడ్డి, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించండి



పాపన్నపేట(మెదక్): మాజీ సర్పంచ్‌లను ముందస్తు అరెస్ట్ చేసిన పోలీసులు

చిన్నశంకరంపేట(మెదక్): సర్పంచ్‌ల పదవి కాలం ముగిసి ఏడాది గడుస్తున్నా.. ఇంకా పెండింగ్ బిల్లులు చెల్లించకుండా ముందస్తు అరెస్ట్‌ల పేరుతో వేధించడం తగదని మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు యాదగిరి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని మాజీ సర్పంచ్‌లను పోలీస్‌లు అరెస్ట్ చేసి, పోలీస్‌స్టేషన్ తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే స్పందించి సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ బాధలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లకుండా ముందస్తు అరెస్టులు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్ ఉన్నారు.

నార్సింగిలో ముందస్తు అరెస్ట్...

నార్సింగి మండలంలోని మాజీ సర్పంచ్‌లను పోలీస్‌లు ముందస్తు అరెస్ట్ చేశారు. మండలంలోని మాజీ సర్పంచ్‌లు మల్లేశం, షేక్ షరీఫ్, నరేశ్, శ్రీనివాస్‌లను పోలీస్‌స్టేషన్ తరలించినట్లు నార్సింగి ఎస్ఐ అహ్మద్ మోహినొద్దీన్ తెలిపారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్

పెద్దశంకరంపేట(మెదక్): పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని కోరుతూ చలో సెక్రటేరియేట్‌కు తరలుతున్న మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం రాష్ట్ర మాజీ సర్పంచ్‌ల జేఏసీ పిలుపు మేరకు హైదరాబాద్‌కు వెళ్తున్న వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. తమ పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని మాజీ సర్పంచ్‌లు కోరారు.

పాపన్నపేట(మెదక్): మాజీ సర్పంచ్‌లను మంగళవారం పాపన్నపేటలో పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు గురుమూర్తి, లింగారెడ్డి, జగన్, దానయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యులు కుబేరుడు, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, విఠల్, తిరుపతిరెడ్డి ఉన్నారు.

అరెస్ట్ చేయడం ఎంత వరకు సమంజసం

మాజీ సర్పంచ్‌లకు ఇవ్వాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఇంత వరకు పెండింగ్ బిల్లులు చెల్లించ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళన చేయాలని భావిస్తే అరెస్ట్ చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు



పది విద్యార్థులకు స్నాక్స్ అందిస్తున్న హెచ్‌ఎం

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు ఉన్నాయని విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని హెచ్‌ఎం బాలచంద్రం అన్నారు. శివ్వంపేట ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిమిత్తం స్నాక్స్ అందజేశారు. పది విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్ ఇవ్వాలనే సంకల్పంతో ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, పదిలో 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు హెచ్‌ఎం చెప్పారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



అల్లాదుర్గం(మెదక్): మండల కేంద్రంలోని బాలికల జెడ్పీ పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. పదో తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తించి తోటి విద్యార్థులకు విద్యబోధన చేశారు. ఇందులో ప్రతిభ కనభర్చిన విద్యార్థులకు పాఠశాల హెచ్‌ఎం రవికుమార్ బహుమతులు అందజేశారు.